అతివకు అండగా ఆరోగ్య మహిళ



- జిల్లాలో 8 పీహెచ్‌సీల్లో కొనసాగుతున్న ప్రత్యేక కార్యక్రమం
- ఇప్పటికే 41,667 ఓపీ నమోదు
- వివిధ రుగ్మతలతో 28,357 ఆసుపత్రులకు
- క్యాన్సర్ బాధితులే అధికం

జగిత్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మారిన జీవన శైలి..ఆహారపు అల వాట్లు, పని ఒత్తిడి, అవగాహన లోపం తదితర కారణాలతో అతివలు పలు వ్యాధుల బారిన పడుతున్నారు. రక్తహీనత, హార్మోన్‌ల హెచ్చతగ్గులు, పోషకాహారం లోపం, తదితర సమస్యలు మహిళలను వెంటాడుతున్నాయి. పలు పీహెచ్‌సీలలో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాల్లో ఈ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా క్యాన్సర్ ముప్పు చాపకింద నీరు లా విస్తరిస్తుండంతో ఆందోళన కలిగిస్తుంది. అవగాహనతో ముందే తెలుసుకుంటే వ్యాధులను నయం చేసుకోవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. జిల్లాలోని ఎనిమిది పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్లలో ఆరోగ్య మహిళ కార్య క్రమం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో కార్యక్రమం ఇలా...

జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్‌లో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని 2023 జూన్ నుంచి నిర్వహిస్తున్నారు. సారంగపూర్, ధర్మపురి మండలం నేరేళ్ల, గొల్లపల్లి, కొడిమ్యాల, కోరుట్ల మండలం అయిలాపూర్, మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జగిత్యాలలోని జేఎస్‌రామ్ కాలనీలో గల వెల్‌నెస్ సెంటర్‌లో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం జరుపుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 41,667 మంది మహిళలు ఓపీ కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. జిల్లాలో 28,357 మంది మహిళలు వివిధ రోగాలతో బాధపడుతున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఇందులో 26,555 మంది సాధారణ రోగాలతో, 1,335 మంది అసాధారణ రోగాలతో ఉండగా, 467 మంది మహిళల పరిశీలన జరగాల్సి ఉంది. ప్రస్తుత యేడాది ఆరోగ్య మహిళ కార్యక్రమంలో జరిపిన వైద్య పరీక్షల్లో థైరాయిడ్ బాధితులు 17 మంది ఉన్నారు. నోటి క్యాన్సర్ 599 మంది, బ్రెస్ట్ క్యాన్సర్ 584 మంది, సర్వేకల్ క్యాన్సర్ 48 మంది, సుఖ వ్యాధులు 21 మంది, గర్భాశయ అవస్థ 449 మంది, అధిక బరువు 99 మంది, రక్తహీనత 774 మంది బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే....

బాల్య వివాహాలు, అపరిశుభ్రత, అబార్షన్ ఇతరత్రా కారణాలతో గర్భాశయ క్యాన్సర్ కలుగుతుందని వైద్యులు అంటున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలకు హైద్రాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రికి రెఫర్ చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరీక్షలు పెంచితే బాధితుల సంఖ్య అధికంగా ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు అంటున్నారు. టీకా తీసుకోవడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం ద్వారా వీటిని నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రాథమిక దశలో మొహమాటం కారణంగా వైద్య పరీక్షలకు ఆసక్తి చూపక పోతే ఇబ్బంది తప్పదని సూచిస్తున్నారు.

నమూనాలు టీ హబ్‌కు తరలింపు...

అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా ఆరోగ్య మహిళ వైద్య పరీక్షల ప్రక్రియ కొనసాగుతోంది. మహిళల్లో కాన్సర్ ముప్పు, నివారణ గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఆధునిక జీవన విధానంలో మారిన ఆహార పు అలవాట్ల కారణంగా చాప కింద నీరులా కాన్సర్ విస్తరిస్తోంది. గర్భాశయ, రొమ్ము కాన్సర్ రూపంలో ఎక్కువగా విస్తరిస్తున్నట్లు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఎక్కువ మంది మహిళలు జీవన విధానంలో మార్పులతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతూ దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతు న్నట్లు వైద్యులు గుర్తిస్తున్నారు. రక్తపోటు, మధుమేహం పరీక్షలు అక్కడికక్కడే చేస్తూ ఇతరాల నిర్ధారణ కోసం నమూనాలను టీహబ్ కు పంపిస్తున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి

: సమీయొద్దిన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి



సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం మహిళలు చేసుకోవాలి. వైద్యులు, సిబ్బంది అంతా మహిళలే ఉంటారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలన్నీ ఈ కేంద్రాల్లో చెప్పుకోవచ్చు. పలు రుగ్మతులతో బాధపడే వారికి అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన వారిని జిల్లా ఆసుపత్రి లేదా హైద్రాబాద్ దవాఖానాలకు సిఫార్సు చేసి ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

లక్షణాలుంటే మెరుగైన వైద్యం

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



మహిళలు పని ఒత్తిడితో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా వివిధ రకాల వ్యాధులతో సతమ తమవుతున్నారు. ప్రాథమిక దశలో వీటిని గుర్తించి వైద్య అందించేందుకు ఆరోగ్య మహిళ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలా గుర్తించిన వారికి జిల్లాలోని వైద్య అందిస్తున్నాము. సమ స్య తీవ్రంగా ఉంటే ఇతర ప్రాంతాల ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాము. రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాది రాకుండా కాపాడుకోవచ్చును.

మత్తు పదార్థాలతో యువత జీవితం నాశనం

జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 6: మత్తు పదార్థాల వినియోగంతో యువత ఉజ్వల భవిష్యత్, జీవితం నాశనం అవుతాయని డీఎస్పీ రఘుచందర్, ఆంటీ నార్కొటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాలలో ఆంటీ నార్కొటిక్స్ బ్యూరో పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యధికంగా యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్ లేదా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోలకు వాట్సాప్ ద్వారా తెలపాలన్నారు. అనంతరం డీఎస్పీ రఘుచందర్, నార్కోటిక్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, పట్టణ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌లు మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం మత్తుపదార్థాలకు బానిస కావద్దని ప్రతిజ్ఞ చేయించారు.

ఎస్ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునీందర్, అధ్యాపకబృందం, పాల్గొన్నారు.

సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాలరూరల్, ఆగస్టు 6 : నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో రీ ప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ మిషన్ ప్రాజెక్ట్-2లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్లడ్‌బ్యాంక్, బ్లడ్ స్టోరేజీ సెంటర్‌లలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వీరు పట్టణాల్లో, గ్రామాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడమే కాకుండా అపోహలను తొలగిస్తూ యువకులు రక్తదానం చేసేదిశగా ప్రోత్సహిస్తున్నారని, సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

మల్యాల, ఆగస్టు 6: అనారోగ్యంతో మృతి చెందిన కొండగట్టుకు చెందిన గుర్రం మల్లేశంగౌడ్, ఒల్లాల రాజేశ్వరీ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. మల్లేశంగౌడ్ కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న పంజాల మధును కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ముత్యం శంకర్, రాజేశ్వర్ రెడ్డి, మ్యాక లక్ష్మన్, శనిగారపు తిరుపతి, కొలకాని మారుతీ, మిస్త్రీ శ్రీను, బండి రవి, రాజేశంగౌడ్ ఉన్నారు.

బడ్జెట్‌లో ఏ పథకానికీ నిధులు కేటాయించ లేదు

- బీఆర్ఎస్ నాయకులకు పదవులు ముఖ్యం కాదు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, ఆగస్టు 6 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏ ఒక్క పథకానికి కూడా నిధులు కేటాయించలేదని, బీఆర్ఎస్ నాయకులు పదవుల కోసం పాకులాడరని, సరుకు లేదు సబ్జెక్టు లేకుండా బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవ సాయ మోటర్లకు మీటర్లు పెట్టవద్దని 2017లోనే అప్పడి సీఎం కేసీఆర్ వ్యతిరేకించాడని అన్నారు. కేసీఆర్ మాటలను వక్రీకరించి మోటార్లకు మీటర్లు పెడుతామని ఒప్పుకున్నట్లు అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాడని అన్నారు. బడ్జెట్‌లో రైతు బంధు, రైతు భరోసా కోసం ఏలాంటి నిధులూ కేటాయించలేదని, రానున్న రోజుల్లో వాటిని నిలిపివేస్తారని ఆరోపించారు. రైతు రుణమాఫీ కోసం రూ. 31 వేల కోట్లను కేటాయించినట్లు ప్రకటించిన ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ. 25 వేల కోట్లు మాత్రమే కేటాయించడంపై ప్రభుత్వ నీతిని తెలుపుతుందని అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ చేరడానికి ప్రయత్నిస్తే అధికార పార్టీ నేతలు అతన్ని చెదిరింపులకు పాటుపడుతున్నారని ఆరోపించారు. ఇప్పడి వరకు 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. తెలంగాణ ప్రజలకు అబద్దాలు చెబుతూ మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి మాజీ సర్పంచ్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, కౌన్సిలర్ బట్టు సునిల్ బీఆర్ఎస్ నాయకులు ఫహీం, మురళిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



కోరుట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ

రాయికల్, ఆగస్టు 6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయికల్ పట్టణంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సమయానికి బస్సు వచ్చేలా చేస్తానని తెలిపారు. అలాగే కళాశాలలోని వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. మండలంలోని చింతలూరు గ్రామానికి శ్రీనివాస్ తల్లి, పిట్ల మైసయ్య, మంగ్యానాయక్ తండాకు చెందిన శ్యామ్ లాల్, రాయికల్ పట్టణానికి చెందిన రాధమ్మ, బ్రహ్మ య్య, రాజశేఖర్‌లు ఇటీవల మరణించగా వారి కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 6: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో హెల్త్ క్యాంప్‌ను నిర్వహించగా ఆమె సందర్శించారు. సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వారణాసి మల్లవ్వ, హనుమండ్ల జయశ్రీ, పద్మ, లావణ్య, వైద్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

●పట్టణ ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని బల్దియా చైర్‌పర్సన్ మున్సిపల్ వాటర్ సప్లై అధికారులు, సిబ్బందికి సూచించారు. 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ అధికారులు, పాల్గొన్నారు.

●స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ రాం బాబు ఆధ్వర్యంలో జగిత్యాల, మల్యాల ఎంఎల్ఎస్ పాయింట్స్ వద్ద మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలంద విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 6: శాతవాహన యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన డిగ్రీ రెండు, నాలుగు, ఆరవ సెమిస్టర్ ఫలితాల్లో నలంద విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ తెలిపారు. బీఎస్సీ విభాగంలో దుంపెట శ్రీజ 9.47, ఎ. పూజిత 9.37, రాచబత్తుల అక్షయ, వొడ్నాల సుధీర్ 9.25 జీపీఏ సాధించగా మరో 11 మంది విద్యార్థులు 9పైన జీపీఏ సాధించారని, అలాగే బీబీఏ విభాగంలో గాజెంగి రాంప్రసాద్ 9.16 జీపీఏ సాధించారని తెలిపారు. విద్యార్థులను యాజమాన్యం అభినందించారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

రాయికల్, ఆగస్టు 6: పట్టణంలోని విస్డమ్ హైస్కూల్‌లో విద్యార్థుల మానసిక, వ్యక్తిత్వ వికాస పరిణితి కోసం విశ్వతేజాస్ ట్రైనింగ్, కౌన్సెలింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. సమాజంలో మారుతున్న పోకడలకు, విద్యా వ్యవస్థలో అనునిత్యం జరుగుతున్న మార్పులకు, పిల్లల్లో చోటు చేసుకుంటున్న టెక్నాలజీ వ్యసనంలాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగర శ్రీహరి, తైక్వాండో శిక్షకుడు నరహరి నాయక్, పాఠశాల డైరెక్టర్ ఎద్దండి నివేదిత రెడ్డి, విశ్వతేజాస్ డైరెక్టర్ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్



కలెక్టర్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్


జగిత్యాల అర్బన్, ఆగస్టు 6: జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయంలో మంగళవారం జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శనంగా నిలిచారన్నారు. ఆయన మన మధ్యలో లేనప్పటికీ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

●ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లో గల జయశంకర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ బాధ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

●ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో జయశంకర్ విగ్ర హానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ పాల్గొన్నారు.

●జయశంకర్ జయంతిని సీనియర్ సిటిజన్, పెన్షనర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 10మంది నిరుపేద వృద్ధులకు గొడుగులు, పాదరక్షలు పంపిణీ చేశారు.

●పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, సునీల్, తొగిటి గంగాధర్, తోపాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు





మద్యం షాపులో చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: కరీంనగర్ కోతిరాంపూర్‌లోని మానస వైన్‌షాపులో సోమవారం అర్ధరాత్రి దొంగ చొరబడి కౌంటర్‌లోని 35 వేల రూపాయలు ఎత్తుకుపోయాడని ఒకటో టాణా పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి వైన్‌షాపును మూసివేసిన క్యాషియర్ తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి వైన్ షాపు షటర్ గోడ పగులగొట్టి,షటర్ బయటకు లాగి ఉంది. యజమానితో కలిసి లోపలికి వెళ్లి చూడగా కౌంటర్ తెరచి ఉండగా అందులోని 35 వేల రూపాయల నగదు దొంగ ఎత్తుకుపోయినట్లు గుర్తించారు. పోలీసులు షాపులోని సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. మరొక షాపులో కూడా చోరీకి ప్రయత్నించినట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6: ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై మద్యం మత్తులో పురుగుల మందు తాగిన కరీంనగర్ రూరల్ మండలం చెర్ల బూత్కూర్‌కు చెందిన రంగు శ్రీనివాస్(41) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గీతకార్మిక వృత్తితో జీవిస్తున్న రంగు శ్రీనివాస్ అప్పుల బాధతో ఈనెల 4న కల్లు గీసేందుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, ఆగస్టు 6: అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యంను సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మల్యాల మండల కేంద్రంలోని సంగని రాములు అనే వ్యక్తి ఇంటి సమీపంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు రేషన్‌బియ్యంను అక్రమంగా తరలించడానికి నిల్వ చేశారనే సమాచారం మేరకు అక్కడకు వెళ్లిన డీటీసీఎస్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, బ్లూకోల్ట్ పోలీసులు ప్రసాద్, నర్సింగ్ ఇతర అధికారులు పది క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యంను మల్యాలలోని సివిల్ సప్లై గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు.

రామడుగు: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. వరంగల్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న లారీలో 200 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న కందుకూరి మహేష్‌బాబు అనే వ్యక్తి తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ ఆలీమ్‌ఖాన్, గుమాస్తా ల్యాడ నరేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మేకల మందపై చిరుత దాడి

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం గోరంటాల ఎద్దుగుట్ట అటవీ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మేకల మందపై చిరుత దాడి చేసింది. చిరుత ఒక్కసారి మేకల మందపై విరుచుక పడడంతో పరుగులు తీశాయి. మేకల కాపరి శ్రీనివాస్ కొద్దిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. తన చేతిలో ఉన్న గొడ్డలితో కాపరి బెదిరించే ప్రయత్నం చేయడంతో చిరుత అతడి వైపు వెళ్లలేదు. చిరుత అక్కడి నుంచి వెళ్లే క్రమంలోఒ మేకను ఎత్తుకెళ్లినట్టు కాపరి శ్రీనివాస్ తెలిపాడు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు : తప్పిన ప్రమాదం



పొలంలో బోల్తాపడ్డ కారు

రుద్రంగి, ఆగస్టు 6: రుద్రంగి మండల కేంద్రం శివారులోని మూలమలుపు వద్ద సామవారం రాత్రి కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కారు రుద్రంగి నుంచి కోరుట్ల వైపు సోమవారం రాత్రి 11 గంటలకు వెళ్తుండగా మూలమాలుపు వద్ద ఒక్కసారిగా కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటన స్థలాన్ని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూవివాదంలో రౌడీషీటర్ అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 6: మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ భూపతి వెంకటేశ్‌ను భూవివాదంలో మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ ఇదే గ్రామానికి చెందిన పైడి రేవతిపై గత నెలలో పారతో తలపై దాడిచేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశంపై ఇప్పటికే ఆరు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.






















సైబర్ వలలో పిల్లల వైద్యుడు

● రూ. 74 లక్షలు కాజేసిన నేరగాళ్లు

మెట్‌పల్లి , ఆగస్టు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ పిల్లల వైద్యుడు సైబర్ వలలో చిక్కుకుని ఏకంగా రూ.74 లక్షలు మోసపోయిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో ఇన్‌స్టాగ్రాంలో ఓ లింక్‌ను క్లిక్ చేసి ఏసీ మ్యాక్స్ అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎసెల్ స్టూడెంట్ గ్రూప్‌ను ఫాలో అవుతూ డబ్బులు ఇన్వెస్ట్ చేసాడు. ఎంత డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అంత పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు సదరు వైద్యుడిని నమ్మించారు. దీంతో వైద్యుడు మొత్తం 74 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేసాడు. ఇన్వెస్ట్ చేసిన డబ్బులతో పాటు ఇంకా అధిక మొత్తంలో డబ్బులు రావాలంటే ఇంకా జమచేయాలని సైబర్ నేరగాళ్లు నమ్మించే ప్రయత్నం చేసారు. అనుమానం వచ్చిన వైద్యుడు తను ఇన్వెస్ట్ చేసిన డబ్బులు విత్‌డ్రా చేయాలని కోరగా ఇంకా 31 లక్షలు కడితేనే విత్ డ్రా అవుతుందని తెలుపడంతో మోసపోయినట్లు తెలుసుకుని 1930కి కాల్ చేసి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశాడు. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 13న ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మోసపోయిన 74,38,812 లక్షలలో 10 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు మెట్‌పల్లి డిఎస్పీ ఉమామహేశ్వర రావు తెలిపారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

17యేళ్ల తర్వాత రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీలు

● 27 మందికి ఉత్తర్వులు ● మూడు రోజుల్లో చేరాలని దేవాదాయశాఖ ఆదేశాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎట్టకేలకు దేవాదాయ శాఖ నుంచి17యేళ్లకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 27 మంది ఉద్యోగులకు యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, బాసర, కొమురవెల్లి దేవాలయాలకు బదిలీచేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా యేళ్ల తరబడి ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదిలీ చేయాలనే దేవాదాయ శాఖ భావించి పెద్ద మొత్తంలో ఉద్యోగులకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రాజన్న ఆలయానికి చెందిన ఇద్దరు ఏఈవోలు, ఏడుగురు పర్యవేక్షకులు, ఎనమిది మంది సీనియర్ అసిస్టెంట్‌లు, 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లుతో పాటు డీఈని బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న మూడు రోజుల్లో సంబంధిత ఆలయాల్లో విధుల్లో చేరాలని బదిలీ ఉత్తర్వులో ఆదేశాలు జారీ చేశారు.



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

రాజన్న ఆలయం నుంచి బదిలీ అయిన ఉద్యోగులు వీరే

రాజన్న ఆలయంలో ఏఈవోలుగా విధులు నిర్వర్తిస్తున్న ఏఈవో ఎస్. హరికిషన్ శ్రీసీతరామచంద్ర స్వామి దేవాలయం భద్రాచలం బదిలీ అయ్యారు. ప్రతాప నవీన్‌కుమార్ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం యాదగిరిగుట్టకు బదిలీకాగా పర్యవేక్షకులు శ్రీరాములును శ్రీమల్లికార్జున స్వామి ఆలయం కొమురవెల్లికి, నటరాజును శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, హరిహరనాథ్‌ను శ్రీ ఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, లక్ష్మణ్‌రావును శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, జి. శ్రీనివాస్, నాగుల మహేష్‌లను శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, అరుణ్‌కుమార్‌ను శ్రీసీతరామ చంద్ర స్వామి ఆలయం భద్రాచలం బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పత్తిపాక శ్రీనివాస్, పచ్చునూరి రాజేందర్, ఎమ్. రవీందర్, పవన్‌కుమార్, రమేష్‌లను శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం యాదగిరిగుట్టకు, భూపతిరెడ్డి, అశోక్‌లను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, సిహెచ్. రాజేశ్వర్‌ను శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు బదిలీలు చేశారు. జూనియర్ అసిస్టెంట్‌లు విధులు నిర్వర్తిస్తున్న ఎన్. తిరుపతి, నగేష్‌రాజు, ఎల్. రాజేందర్, సిహెచ్. లింగయ్య, రామేశ్వరరావులను యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయానికి, సిహెచ్. శ్రీనివాస్ శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం బాసరకు, తూము శ్రీనివాస్, టి.రవి, ఎస్. నాంపల్లి, కె. రాములలను శ్రీఆంజనేయస్వామి ఆలయం కొండగట్టుకు, బి. శివరామ్‌ను శ్రీసీతరామచంద్ర స్వామి ఆలయం భద్రాచలం ఆలయాలకు బదిలీలు అయ్యారు.

సుద్దాలలో మహిళ ఆత్మహత్య

సుల్తానాబాద్, ఆగస్టు 6: సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామంలో ఓ వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. సుద్దాల గ్రామానికి చెందిన ఆల్లాడి శ్రీలత (45) గ్రామంలోని వారి స్వంత ఇంటిలో ఒక్కతే ఉంటోంది. ఆమె భర్త ఇరవై సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రస్తుతం మృతురాలి ఇద్దరు కుమారులు కార్తీక్‌రావు, కళ్యాణ్‌రావు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన శ్రీలత మంగళవారం తెల్లవారేసరికి ఎంతకూ లేవక పోవడంతో కిటికీలోంచి చూస్తే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంది. కడుపునొప్పి భరించలేక తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని పెద్ద కుమారుడు కార్తీక్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

మంథనిరూరల్, ఆగస్టు 6: మండలంలోని గుమ్మునూరు గ్రామంలో బండారి రాజ్‌కుమార్(23) అనే యువకుడు ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌లో మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గుమ్మునూరులోని తన బంధువుల ఇంట్లో ఉంటూ రెండు రోజుల క్రితం మంథనిలో ఓ షాపుకు వెళ్లి నకిలీ ఫోన్‌పే ద్వారా రూ. 300 పంపి నగదు తీసుకున్నాడు. మళ్లీ సోమవారం కూడా అదే షాపునకు వెళ్లి రూ. 500 నకిలీ ఫోన్‌పే ద్వారా పంపి నగదు రూపంలో ఐదు వందలు ఇవ్వాలని షాపు అతన్ని కోరగా తనకు రెండు సార్లు డబ్బులు తన ఖాతాకు రాలేదని గుర్తించిన షాపు యాజమానికి సాయి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో తీసిన వీడియోలను ఓ వ్యక్తి తన సోషల్ మీడియా ద్వారా వైరల్ చేయగా రాజ్‌కుమార్ మనస్థాపం చెంది ఉరివేసుకొని చనిపోయాడని, షాపు యాజమానికి, వీడియో వైరల్ చేసిన వ్యక్తిపై తల్లి తిరుమల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఓదెల, ఆగస్టు 6: మండలంలోని మడకకు చెందిన నేదురి రాజ కొమురయ్య (51) అనే వ్యక్తి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఈ విధంగా ఉన్నాయి. మడకలో పంక్చర్ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజ కొమురయ్య అప్పుల బాదతో పాటు మద్యానికి బానిసై ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యు లు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు.


భోజన్నపేటలో యువకుడు..

పెద్దపల్లి రూరల్,ఆగస్టు 6: మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన కునారపు రవికిరణ్ (31) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రవి కిరణ్ కరోనాకు ముందు సాఫ్టవేర్ ఉద్యోగం చేసేవాడని కరోనా వచ్చాక ఉద్యోగాన్ని వదిలి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుండి ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో మనస్థాపం చెందేవాడని సోమవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి , మెరుగైనా వైద్యం కోసం కరీంనగర్ తరలించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తగ్గిన వరద నీరు

● రెండు మోటార్ల ద్వారా మిడ్ మానేరుకు ఎత్తిపోతలు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 6: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్న నీటిని అధికారులు తగ్గించారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 4,660 క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసిన అధికారులు సాయంత్రం వరకు ఒక మోటారును నిలిపివేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మరొక మోటార్‌ను నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. బుధవారం ఇన్‌ఫ్లో పెరగకపోతే మిగతా రెండు మోటర్లనూ నిలిపివేసే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు 11 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 9,980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.98 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3. 5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రానికి 1.29 టీఎంసీల నీరు చేరింది. మధ్య మానేరు నుంచి సర్జిపూల్‌లోకి నీరు వచ్చిచేరుతుండడంతో రెండు మోటార్ల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నామని డీఈ దేవేందర్ తెలిపారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

● ఎస్సారెస్పీకి 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 10,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.451 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక టాక్టర్ల పట్టివేత

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న టాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన టాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు మార్త రాజేశం,కర్రే మహేష్, కర్రే నర్సయ్యలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఆగస్టు 6: హుజూరాబాద్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. పట్టణంలోని మామిండ్లవాడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 1630 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మామిడాలపల్లిలో వృద్ధురాలి మృతి

వీణవంక,ఆగస్టు6: మండలంలోని మామిడాలపల్లి గ్రామనికి చెందిన దర్పల్లి మల్లమ్మ (80) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లమ్మ, ఒంటరిగా ఉంటూ జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దర్పల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

గంజాయి విక్రయిస్తూ హైదరాబాద్‌లో పట్టుబడ్డ పెద్దపల్లి యువకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6: హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తూ పెద్దపల్లి యువకులు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆంధ్రా ఒరిస్సా బార్డర్‌లో 4 వేల రూపాయలకు కిలో చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురు పెద్దపల్లి యువకులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అప్పన్నపేటకు చెందిన ఆకుల మిత్రచెతన్య, నిట్టూరు కు చెందిన మహ్మమద్ లతీఫ్‌తో పాటు ఇల్లకుంటకు చెందిన దామ్మని అరవింద్‌లు గుర్తించారు. ఈ గంజాయిని పెద్దపల్లికి చెందిన బండి సాయి చరణ్ విశాఖ సీలేరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తేలింది. వీరిని పట్టకున్న వారిలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ సీఐ ఓంకార్, ఎక్సై శ్రీనివాసులు, పి, నరేష్‌లు ఉన్నారు.

భూకబ్జా కేసులో అధికారి సరెండర్?

జగిత్యాలరూరల్, ఆగస్టు 6: నకిలీపత్రాలు సృష్టించి విలువైన భూమిని కబ్జాకు యత్నించినవారికి సహకరించిన కేసులో గతంలో జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఓ అధికారి మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళితే జగిత్యాల పట్టణంలోని స్థానిక హస్నాబాద్ శివారులోగల సర్వేనంబర్ 1599లో గల 12 గుంటల స్థలం కబ్జాచేసిన వ్యవహారం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. తమది కాదని తెలిసిన విలువైన భూమిని కాజేసేందుకు కుట్రపన్ని సదరుభూమికి సంబంధించిన నకిలీపత్రాలు సృష్టించుకున్న ఇద్దరు వ్యక్తులతో పాటు అక్రమంగా వీఎల్‌టీ నంబర్ కేటాయించి సహకరించించిన మున్సిపల్ ఆర్ఓ ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. భూకబ్జా వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. అతనితో పాటు జగిత్యాలలో గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి సైతం పరారీలో ఉండగా మంగళవారం జగిత్యాల కోర్టులో లొంగిపోయినట్లు విశ్వసనీయ సమాచారం తెలిసింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ కర్ణన్

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 6: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆసుత్రిలో ఉన్న డాక్టర్లు, సిబ్బంది వివరాలతో పాటు సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం పెరిగే విధంగా రోగులకు వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ప్రసవాల కోసం వచ్చే వారిని ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించ వద్దని, గర్భిణులు మాతా శిశు కేంద్రానికి వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణిలకు మెరుగైన వైద్యం అందించాలి

సుల్తానాబాద్, ఆగస్టు 6: ప్రభుత్వ అసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రభుత్వ అసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి వివరించారు. ఈ సందర్భంగా కర్ణణ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా ప్రసవాల సంఖ్య పెరిగే విషయంలో జిల్లా అధికారులు దృష్టి నిలపాలన్నారు. సీజనల్ వ్యాధులతో వస్తున్న రోగులకు సత్వర చికిత్సలు అందించాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ కోయ శ్రీహర్ష, మహేందర్, సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, కమిషనర్ శోభశంకర్ తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కర్ణన్

కొండగట్టులో శ్రావణ సందడి



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగ శ్రావణ సప్తాహ ఉత్సవాలు రెండవ రోజు కొనసాగాయి. అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

గంగాధరలో బస్సు, లారీ ఢీ

● లారీ డ్రైవర్ మృతి
● బస్సులోని ప్రయాణికులకు స్వల్పగాయాలు

గంగాధర, ఆగస్టు 6: గంగాధర మండలం కొండన్నపల్లి స్టేజి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి జిజే 06ఎఎక్స్7548 నెంబరు గల అయిల్ ట్యాంకర్ లారీ జగిత్యాల వైపు వెళ్తోంది. టీఎస్ 02 యూబి 7794 ఆర్టీసీ బస్సు నిండుగా ప్రయాణికులతో చిల్వాకోడూర్ నుండి కరీంనగర్ వెళ్తోంది. కొండన్నపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న అయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఢీకొట్టగానే లారీ డ్రైవర్ అఫ్జల్ అలాంకు బలమైన గాయాలై వాహనం అదుపు కాలేక బస్సును కొద్ది దూరం లాక్కెల్లి నిలిచింది. అతికష్టం మీద లారీ డ్రైవర్‌ను స్థానికులు బయటకి తీసిన కొద్ది సమయంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ రాజుకు కాలు విరగగా 12 మంది ప్రయాణికులకు స్వల్పగాయ్యైనట్లు తెలిపారు. గాయపడ్డ ప్రయాణికులను 108లో కరీంనగర్‌కు తరలించారు. ఇదే సమయంలో బీర్‌పూర్ నుంచి కరీంనగర్ వెళ్తున్న టాటా ఏస్ ట్రాలీని వెనకనుండి బస్సు ఢీకొట్టింది. ట్రాలీ డ్రైవర్ వెంకటేశంకు కాలు విరిగింది. ట్రాలీ ముందు భాగం దెబ్బతినగా క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను కష్టంమీద బయటికి తీశారు. ఘటన స్థలానికి ఎస్ఐ కిరణ్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



కొండన్నపల్లి స్టేజీ వద్ద ఎదురెదురుగా ఢీకొన్న లారీ, బస్సు

పోలీస్‌స్టేషన్‌లో పందెం కోళ్ల వేలం

కమాన్‌పూర్, ఆగస్టు 6: కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పందెం కోళ్ల వేలం పాట ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో రెండు పందెం కోళ్లకు రూ. 6,500 ధర పలికింది. ఒక పందెం కోడి రూ. 4 వేలకు మండల కేంద్రానికి చెందిన పురాణం సారయ్య దక్కించుకున్నారు. మరో పందెం కోడిని బోనాల సత్యనారాయణ రూ. 2500లకు దక్కించుకున్నాడు. ఈ పందెం కోళ్ల వేలం పాటలో వచ్చిన డబ్బులను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెల 27న మండ లంలోని పెంచికల్‌పేట గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు జరిపారు. ఏడుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించగా 50 మంది పాల్గొన్నారు.

జ్వరంతో పారిశుధ్య కార్మికుడి మృతి

రాయికల్, ఆగస్టు 6: మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య(56) జ్వరంతో బాధ పడుతూ మంగళవారం మృతి చెందాడు. చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య 12 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా రాయికల్‌లో పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్న లింగయ్యను కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందజేస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి.. ప్రాణాపాయ స్థితిలోకి...

శంకరపట్నం, ఆగస్టు 6: శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన ముంజ లక్ష్మయ్యకు ఈ నెల 4న సాయంత్రం విరోచనాలు కావడంతో గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. తాను రెండు ఇంజక్షన్లు వేశాడు. తగ్గకపోవడంతో మరుసటి రోజు ఉదయాన్నే ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా రెండు ఇంజక్షన్లు వేసి రెండు గ్లూకోజులు ఎక్కించినట్లు తెలిపారు. లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి అదుపులో లేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లనే తన భర్త ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్నాడని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

చిరుత దాడిలో మూగజీవాల మృత్యువాత

● భయం గుప్పిట్లో గ్రామాలు.. రైతులు ● ఇప్పటికే మూడు మూగజీవాలు మృతి

గంభీరావుపేట, ఆగస్ట్ 6: గంభీరావుపేట మండలం గోరంటాల, దమ్మన్నపేట సరిహద్దు అడవుల్లో చిరుత సంచారంతో ఆ గ్రామాలు భయం గుప్పిట్లో వణికి పోతున్నాయి. అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్ద ఉండే మూగ జీవాలపై చిరుత వరుసగా దాడి చేసి చంపుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో చిరుత దాడిలో మూడు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. నాలుగు రోజుల క్రితం గోరంటాల గ్రామానికి చెందిన రైతు రామచంద్రంకు చెందిన రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపేసింది. పొలం వద్ద కొట్టంలో ఉన్న ఆవులపై దాడి చేసి చంపేయడంతో ఒక్కసారి పరిసర గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ఈ సంఘటన మరువక ముందే దమ్మన్నపేట రైతు నారాయణకు చెందిన దూడపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపేయడంతో ఈ ప్రాంత రైతులు భయం గుప్పిట్లో వణికి పోతున్నారు. దమ్మన్నపేట, గోరంటాల గ్రామాలు పెద్దమ అడవులకు సమీపంగా ఉండడంతో చిరుత సంచారం అధికమైనట్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో అటవీ ప్రాంతానికి అనుకొని ఉన్న ముచ్చర్ల గ్రామ సమీపాన చిరుత రెండు సార్లు దాడి చేసి రెండు మూగజీవాలను హతమార్చింది. రాత్రి వేళల్లో ముచ్చర్ల మార్గం గుండా వెళ్లాలంటే ప్రజలను చిరుత భయం వెంటాడింది. తాజాగా గోరంటాల, దమ్మన్నపేట గ్రామ సమీప పొలల వద్ద ఉన్న మూగ జీవాలపై చిరుత విరుచుకుపడి చంపుతోంది. దీంతో రాత్రి వేళల్లో పంట పొలాల వద్ద వెళ్లాలంటే రైతులు భయందోళనకు గురవుతున్నారు. ఆవులను, దూడలను చంపేస్తున్నది చిరుతేనని ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. రెండు గ్రామాలు పక్క పక్కనే ఉండటంతో ఈ ప్రాంతంలో సంసంచరించేది ఒక్కటే చిరుత అని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.



దమ్మన్నపేట వద్ద చిరుత దాడిలో మృతి చెందిన దూడ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అంజలి, డిప్యూటీ రేంజ్ అధికారి



గోరంటాల, దమ్మన్నపేట రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నది వాస్తవమే. దాడులు చేసిన సంఘటనల ప్రదేశాలను పరిశీలించాం. చిరుత అడుగులేనని తేలింది. ఆవులను, పాడి గేదలను, దూడలను రైతులు ఇంటి వద్దే ఉంచాలి. ఈ రెండు గ్రామాల రైతులు రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దు.

త్రివేణి సంగమం పట్టుచీర ఆవిష్కరణ

● సిరిసిల్ల నేత కార్మికుడి మరో ప్రయోగం



పట్టుచీరను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వినూత్న ప్రయోగాలతో చేనేత వైభవాన్ని చాటుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ మరో పట్టుచీరను ఆవిష్కరించాడు. పట్టుచీరకు సంబంధించిన రంగుల డైయింగ్‌కు ఉపయోగించిన నీటిని గంగ, జమున, సరస్వతి నదుల నుంచి తీసుకురావడం విశేషం. రూ.25 వేలు ఖర్చు చేసి 5.50 మీటర్ల పొడవుతో పట్టు చీరను నేశాడు. మూడు నదుల నీళ్లను ఉపయోగించినందున ఈ పట్టుచీరకు త్రివేణి సంగమం సారీగా నామకరణం చేశాడు. మంగళవారం వరంగల్ జిల్లాలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా త్రివేణి సంగమం పట్టుచీరను ఆవిష్కరించారు. ఇప్పటికే విజయ్ అగ్గిపెట్టె, ఉంగరంలో అమిరే చీరలతోపాటు, కుట్టులేని వస్త్రాలు, బంగారు, వెండిని ఉపయోగించి చీరలను నేసి ప్రశంసలందుకున్నాడు.

నరసింహుడి సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు

ధర్మపురి, ఆగస్టు 6: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. ఆయన వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్, సుముఖ్, సాయి కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

దళిత మహిళలపై పోలీసుల తీరు సరికాదు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, ఆగస్టు 6: షాద్‌నగర్‌లో దళిత మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత నీచమైనదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఈ మేరకు తన కార్యాలయం నుంచి మంగళవారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేరం ఒప్పుకోవాలని మహిళా అని కూడా చూడకుండా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా, ఇదెక్కడి ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆయన ప్రశ్నించారు. క్రమశిక్షణ నేర్పే పోలీసులు, క్రమశిక్షణ తప్పుతుంటే రేవంత్‌రెడ్డి సర్కార్ చోద్యం చూస్తోందని ఆరోపించారు. రక్షించాల్సిన పోలీసులతో రక్షణ లేని పరిస్థితి కాంగ్రెస్ పాలనలో నెలకొందని అయన పేర్కొన్నారు. ఈ దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల నిరసన దీక్షకు మద్దతు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు చేస్తున్న నిరసన దీక్షకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. దీక్ష మంగళవారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చొరవచూపి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ అధ్యక్షుడు లోక బాపురెడ్డి సంఘీభావం ప్రకటించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ దీక్షకు సంఘీభావం తెలిపి, రూ.25వేల విరాళం అందించారు.

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

జగిత్యాలరూరల్, ఆగస్టు 6 : నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నాలుగు వరుసల రహదారి-63 నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా కేంద్రంలోని స్థానిక బీఎల్ఎన్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 27 గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను ఈసమావేశం ద్వారా అధికారులకు తెలియజేశారన్నారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ రాంమోహన్ పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కొడిమ్యాల, ఆగస్టు 6 : ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మాతాశిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి కోరారు. మంగళ వారం మండలంలోని హిమ్మతురావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. పలువురికి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులను అందించారు. అనంతరం జ్వరాల బారిపడిన వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని, పరీక్షలు చేయించి మందులను అందించారు. శిబిరంలో 85 మందికి పరీక్షలు చేసి మందులను అందించారు. 23 మంది రక్త నమూనాలను సేకరించి జిల్లా టీహబ్‌కు పంపారు. మండల వైద్యాధికారిణి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, మాజీ సర్పంచు కృష్ణారావు, ఎంఎల్‌హెచ్‌పీ డా.. నవనీత, సూపర్‌వైజర్లు వెంకటనర్సమ్మ, అలివేలు పాల్గొన్నారు.

న్యాయవాదులు నిత్య విద్యార్థులు

మెట్‌పల్లి , ఆగస్టు 6(ఇబ్రహీంపట్నం) : న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉన్నపుడే ప్రొఫెషన్‌లో మరింతగా రాణిస్తారని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కాసుగంటి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రోజురోజుకు మారుతున్న బార్ కౌన్సిల్ నిబంధనల్ని న్యాయవాదులందరు ఎప్పటికప్పుడు తెలుసుకుంటు పాటించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, ఉపాధ్యక్షులు ఎలుముల రాంబాబు, న్యాయవాదులు జగన్, వెంకట నర్సయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

కోరుట్ల, ఆగస్టు 6 : ఎన్నికలకు మందు కాంగ్రెస్ ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాయలంలో వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు కాశిపేట శివాజీ, సోరపాక రమేష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెవేళ్లలో ప్రకటించిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకె అశోక్ డిమాండ్ చేశారు. ఎస్సీ డిక్లరేషన్ అనుగుణంగా నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎస్సీ మంగళవారం బీజేపీ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకె అశోక్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సుఖేందర్‌గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, నరేష్, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంజన్న ఆలయ ఉద్యోగుల బదిలీ

మల్యాల, ఆగస్టు 6: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. చాలా ఏళ్ల తరువాత కొండగట్టు దేవస్థానంలోని పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్లు రాజేశ్వర్‌రావు, లతాదేవి, జూనియర్ అసిస్టెంట్లు సంపత్‌కుమార్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానానికి, మరో జూనియర్ అసిస్టెంట్ బి.లక్ష్మిరాజం కొమురవెళ్లి మల్లిఖార్జున ఆలయంకు బదిలీ అయ్యారు. ఇటీవలే ఆలయ ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ కూడా మెదక్ ఏసీగా బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం సత్కరించారు. ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ అడుగు జాడల్లో నడవాలి

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి , ఆగస్టు 6 (ఇబ్రహీంపట్నం) : ప్రొఫెసర్ జయశంకర్ నడవాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. జయంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో, విద్యుత్ డివిజన్ కార్యాలయంలో, ప్రభుత్వ పాఠశాలలో, సుఖీభవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి మాట్లాడుతూ జయశంకర్ జయంతి, వర్ధంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్ ఛైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్, విద్యుత్ డీఈ తిరుపతి, ఏడీఈ మనోహర్, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్య, శ్రీధర్, కృష్ణమాచారి, శ్రీనివాస్, నాగరాజ్ పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడ నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఏకే రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహేష్, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు మహేందర్, శ్రీధర్‌రెడ్డి, మహేష్, కోఆప్షన్ సభ్యుడు మహేందర్ బాబు, మేనేజర్ వెంకటి పాల్గొన్నారు. పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలోని మైతాపూర్, భూపతిపూర్ ఉన్నత పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. పీజీహెచ్‌ఎంలు మోహన్‌రెడ్డి, వెంకటరమణి, రాపర్తి నర్సయ్య, చిన్నయ్య, గిరిధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో జయశంకర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే సంజయ్, ఇతరులు

కోరుట్ల/కోరుట్ల రూరల్ : కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. మండలలోని మండల్ ప్రజాపరిషత్ కార్యా లయంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు.

జగిత్యాలరూరల్: తెలంగాణ భావజాలవ్యాప్తికోసం తన జీవితాన్ని అంకితం చేసి రాష్ట్రసాధనకు మార్గం సుగమం చేసిన మహానీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని జగిత్యాల అదనపు ఎస్పీ భీంరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొపెసర్ జయశంకర్ జీవితం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈకార్యక్రమంలో ఏవో శశికళ, ఆర్‌ఐలురామకృష్ణ, వేణు, ఆర్ఎస్సైలు, డీపీఓ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, పశువైద్యాధికారి కోటేశ్వర్ రావు, ఏపీవో అనీల్ కుమార్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్, మండలం లోని నాచుపల్లి జేఎన్‌టీయులో గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను వివిధ శాఖల అధికారులు ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రాజమణి, ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండల కేంద్రంలోని మండల ప్రజ పరిషత్ కార్యలయంలో, తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ప్రొపెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని విశ్వ బ్రాహ్మణ సంగం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మండల సంఘం అధ్యక్షుడు సంకోజు తిరుమల్, ప్రధాన కార్యదర్శి నందయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్, ఆత్మనగర్ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నాయకులు, అధికారులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు నిజాముద్దీన్, ప్రశాంత్, మాజీ ఎంటీసీ పుల్ల జగన్‌గౌడ్, బోగ గంగాధర్, వెంకటేష్, రాజేందర్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని పలు గ్రామాల్లో జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డితో పాటు అధికారులు, మండల కేంద్రంలోని అయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొల్లపల్లి: జయశంకర్ జయంతిని గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో రాంరెడ్డి, సూపిరిండెంట్ రవీందర్ రావు పాల్గొన్నారు.



ధర్మపురి ఎంపీడీవో కార్యాలయంలో...



జగిత్యాలలో నివాళులు అర్పిస్తున్న అడిసనల్ ఎస్పీ భీంరావు



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న కమిషనర్ తిరుపతి

ఉద్యోగులకు సన్మానం

ధర్మపురి, ఆగస్టు 6: ధర్మపురి మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎండీ సంయోద్దీన్ హాజరై మాట్లాడారు. ఉద్యోగులు నిబద్ధతతో పని చేసినపుడు ప్రభుత్వం అధికారుల ద్వారా గుర్తింపుతో పాటు, గౌరవం కూడ దక్కుతుందని అన్నారు. అలాగే విధి నిర్వహణలో వారు చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇక్కడ పని చేసి బదిలీ పై వెళ్లిన డాక్టరు బి, అవంతి, హెడ్ నర్స్ షోఫియా సుల్తానా, ఫార్మసిస్ట్ ప్రవీణ్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్ సృజన, హెల్త్ సూపర్‌వైజర్ మనోరమ, శ్యామల, హరీష్, ఆర్ శారద, శామీమ్, సుల్తానా, జె సుగణ, అనురాధ, అరుణ కుమారి, స్వప్నలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టరు శ్రీనివాస్, డీపీఓ రవీందర్, సీహెచ్‌వో, శ్రీనివాస్, శాంతి, ఎనుగంటి రాజేష్, సతీష్, వెంకటేష్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, ఆగస్టు 6 : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో యువకులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 655 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోరుట్ల సీఐ సురేష్ బాబుతో కలిసి అరెస్టు వివరాలను వెల్లడించాడు. కోరుట్ల మండల జోగినిపల్లి గ్రామానికి చెందిన అలకుంట రాజేష్ అనే యువకుడు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని పైడిమడుగు గ్రామ శివారులో ఎల్లమ్మ దేవాలయం వద్ద గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద 655 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చౌరస్తాల అభివృద్ధిపై స్థల పరిశీలన

కోరుట్ల, ఆగస్టు 6 : పట్టణంలోని జాతీయ రహదారిని ఆనుకోని ఉన్న ప్రధాన చౌరస్తాల అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు స్థల పరిశీలన జరిపారు. పట్టణంలోని జాతీయ రహదారిని ఆనుకోని ఉన్న అంబేద్కర్, కార్గిల్, నంది చౌరస్తాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలలో చౌరస్తాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. చౌరస్తాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసి ఉన్నత అధికారులకు పంపుతున్నట్లు కమిషనర్ తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్ల్ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

గొల్లపల్లి, ఆగస్టు 6: గొల్లపల్లి మండల కేంద్రంలో మండల స్థాయిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, జ్యోతి నేతృత్వంలో మండలం నలుమూలల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తల్లిపాల వారోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. అంతరాలను తొలగించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించడం తల్లిపాల వారోత్సవాల లక్ష్యమని సూపర్ వైజర్లు మమత, జ్యోతి పేర్కొన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యత గూర్చి తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాయిబాబా, మండల వైద్యాధికారి డా. నరేష్, కార్యదర్శి మధుసూదన్, కారోబార్ మహేష్, ఏఎన్ఎమ్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, సరో జన, అనంత లక్ష్మీ, హరిప్రియ, విజయ, జమున, రమా దేవి, ప్రణీత, శ్యామలత, రాధ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

రాయికల్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎంపీడీవో చిరంజీవి అన్నారు. మండలంలోని భూపతిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయడంతో పాటు రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే రాయికల్ ఎంపీడీవో కార్యాలయంలో అన్నప్రాసన అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, కార్యదర్శి హరికృష్ణ, సూపర్‌వైజర్ రాధ, హెల్త్ సూపర్‌వైజర్ ఉమారాణి, శరణ్య, ఏఎన్ఎం విజయలక్ష్మి, సరిత, కవిత, సుమలత, సుగు, ఫాతిమా బేగం పాల్గొన్నారు.



రాయికల్ మండలం భూపతిపూర్‌లో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న ఎంపీడీవో చిరంజీవి

సంక్షిప్తం సమాచారం

ధర్మపురి: హిరోషిమా నాగసాకి డే సందర్భంగా ధర్మపురి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జడ్‌సీ డాక్టర్ ఇందారపు రామకృష్ణ, అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, పాఠశాల హెచ్‌ఎం కొలిచాల శ్రీనివాస్, ట్రెజరర్ సిరుపతి రాజన్న, సభ్యులు రాజలింగం, శ్రీనివాస్, రవీందర్, పైడి మారుతి, తిరుపతి పాల్గొన్నారు.

●విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ధర్మపురి ఏడీఈ సింధూర్‌శర్మ అన్నారు. మండలంలోని రాయపట్నం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

బుగ్గారం: బుగ్గారం మండలానికి మంజూరైన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవన నిర్మాణానికి బుగ్గారం శివారులోని ప్రభుత్వ భూమిని జిల్లా సెక్టోరల్ అధికారి జీసీడీఓ అనుపమ మంగళవారం స్థల పరిశీలించారు. ఉన్నత స్థాయి అధికారుల అదేశాల మేరకు కేజీబీవీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం సరైనదా..కాదా అని పరిశీలిస్తున్నామన్నారు. బాలికలకు అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ బాపురెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మొహన్‌రెడ్డి, సీఆర్‌పీ పురుషోత్తం పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: హోంగార్డుగా 26 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన సాగర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ భీంరావు మంగళవారం పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్.ఐలు రామకృష్ణ, వేణు, ఎస్సైలు రవీందర్, సుమన్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో ఇటీవల జవ్వాజి కాశవ్వ, చిలువేరి నారాయణ మృతి చెందగా మంగళవారం సాయంత్రం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయనతో పాటు డిష్ నర్సయ్య, జవ్వాజి చౌదరి, పబ్బ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

●వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలంగాణ మున్నూరు కాపు సంఘం అపెక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నేపథ్యంలో మంగళవారం జిల్లా మున్నూరు కాపు సంఘ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బుగ్గారం మాజీ జడ్పీటీసీ రాజేంధర్ ఉన్నారు.

●మండలంలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారిణులు ముగ్గురు బదిలీ అయ్యారు. భూషణరావుపేట క్లస్టర్ ఏఈవో ఫెమీనా యాస్మిన్ మోహన్‌రావుపేటకు, భూషణరావుపేటకు ఇబ్రహీంపట్నంలో పని చేస్తున్న హరీశ్ వచ్చారు. కథలాపూర్ క్లస్టర్ ఏఈవో వినీత మొగిలిపేటకు బదిలీ కాగా ఇక్కడికి మోహన్‌రా వుపేటలో పని చేస్తున్న సంధ్య, బొమ్మెన క్లస్టర్ ఏఈవో వైష్ణవి ఇబ్రహీంపట్నం బదిలీపై వెళ్లగా బొమ్మెనకు గుల్లకోట నుంచి మౌనిక వచ్చారు.

ఎండపల్లి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 13 మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, సోమిశెట్టి రమేష్, పుదారి రమేష్, గాజుల విజయ్, బాలసాని మల్లేశం, గెల్లు శ్రీనివాస్, మ్యాకల సంతోష్ పాల్గొన్నారు.

కథలాపూర్ : స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం సానిటేషన్ కార్యక్రమాలు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా చేపట్టారు. ఎంపీడీఓ శంకర్ భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గొల్లపల్లి : మండల కేంద్రానికి చెందిన చెవులమద్ది లక్ష్మీరాజం కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం ద్వారా మంజూరైన రూ. 2 లక్షల ప్రమాద భీమా సొమ్మును మృతుడి భార్య లక్ష్మీకి గొల్లపల్లి కెడీసీసీ బ్యాంక్ మేనేజర్ మల్లేశం మంగళవారం అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, నాయకులు నల్ల సతీష్ రెడ్డి

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'

కోరుట్ల, ఆగస్టు 6 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు మంగవారం పట్టణంలోని మున్సిపల్ అధికారులు పాలకవర్గ సభ్యులు నిర్వహించారు. అన్ని వార్డులలో మున్సిపల్ కమీషనర్ తిరుపతి ఆధ్వర్యంలో కార్యక్రమాలను మున్సిపల్ అధికారులు, వార్డు సభ్యులు నిర్వహించారు. పట్టణంలోని మంచి నీటి ట్యాంకర్లను శుభ్రం చేసి వాటిలో క్లోరిన్ స్థాయిని అధికారులు పరిశీలించారు. పట్టణంలోని సంట్రల్ లైటింట్ సిస్టంలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించిన ప్రాంతాలలో వేరే మొక్కలను మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ ఛైర్మెన్ గడ్డమీది పవన్‌లతో కలిసి అధికారులు పాలక వర్గ సభ్యులు నాటారు. అధికారులు, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కింద మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పలు పారిశుధ్య పనులను పరిశీలించారు. పట్టణంలోని మైతాపూర్ రోడ్డులో, ఒడ్డెర కాలనీలోని వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి శుభ్రం చేయించారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని ఆదేశించారు. మైతాపూర్ రోడ్డులో గల మున్సిపల్, పెద్ద చెరువు వద్ద, వీరాపూర్ రోడ్డులో గల ఓపెన్ వెల్‌లను పరిశీలించి బ్లీచింగ్ పౌడర్ వేయించారు. అనంతరం పెద్ద చెరువును సందర్శించి చెరువు కట్టపై కొనసాగుతున్న మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. పట్టణంలోని 1,3, 10వ వార్డుల్లోని 300 చదరపు గజాల విస్తీర్ణంపై గల ఇంటి యాజమానులకు గుంతల నిర్మాణం చేయాలని సూచించారు. మేనేజర్ వెంకటి, మున్సిపల్ ఇంజనీర్ సీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛదనం-పచ్చదనం ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. విద్యార్థులకు దాతల సహకారంతో నోట్ బుక్స్, డిక్షనరీలను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, హెచ్ఎం మహేందర్, కౌన్సిలర్లు, టీచర్లు కాసర్ల నర్సింహమూర్తి, కవిత, జ్యోతి, అతియాబేగం, స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ గణేష్ పాల్గొన్నారు

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. క్లోరినేషన్ గురించి వివరించారు. నీటి నిల్వలను చేసుకోవటం వలన కలుగు అనర్థాలను తిప్పయ్యపల్లిలో ఎంపీడీవో స్వరూప వివరించారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి గ్రామస్థాయి అధికారులకు సూచించారు. మండలంలోని నాగులపేట గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను అదనపు కలెక్టర్ ఆకస్మితికంగా తనిఖీ నిర్వహించారు. గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను ఆర్డీవో మండల ప్రత్యేక అధికారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, మండ ల విద్యాధికారి నరేశం, వ్యవసాయ శాఖ ఏవో నాగమణి పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని ఆత్మనగర్, జగ్గసాగర్, వెల్లుల్ల గ్రా మాల్లోని పంచాయతీ పరిధిలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టారు. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు. మంచి నీటి ట్యాంకులను శభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను మురికి కాలువల వెంట చల్లారు. కార్యదర్శులు ప్రశాంత్, నారాయణ, నిజాముద్దీన్, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మల్యాల: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మల్యాలలోని సివిల్ సప్లై గోదాం వద్ద అడిషనల్ కలెక్టర్ రాంబాబు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట సివిల్ సప్లై డీఎం హథీరాం, డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కోరుట్లలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు,అధికారులు



మల్యాలలోని గోదాం వద్ద మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్